# ఓపెన్‌కాస్ట్ నిర్వాసితులకు
# అండగా నిలుద్దాం రండి

**భూ**పాలపల్లి ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టువల్ల జీవనం కోల్పోతున్న రైతులు, కూలీలు, గీత కార్మికులు, అంతా కలిసికట్టుగా నిలబడి జీవనాన్ని కాపాడుకోవడానికి ముందుకు రావాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము.

ఇంకా బొగ్గుతీసే అవకాశం ఉన్న 3 ఇంక్లైన్‌ను సింగరేణి యాజమాన్యం మూసేసి ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు చేపడుతున్నది. నిన్నగాక మొన్న ప్రారంభించిన 3 ఎ ఇంక్లైన్ తెరిచినట్టే తెరిచి వెంటనే మూసేసి దాని స్థానంలో కూడా ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు చేపట్టబోతారని వింటున్నాము. ఇంకా మిగిలి ఉన్న ఆరు బావులు త్వరలో ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టులుగా మారబోతాయని కూడా వింటున్నాం.

భూపాలపల్లిలో బొగ్గు బావులు వస్తున్నాయని కొన్ని ఏళ్ళ క్రింద విన్నప్పుడు ఈ ఊరు కూడా ఒక గోదావరిఖని అవుతుంది, ఒక మంచిర్యాల అవుతుంది; ఈ ప్రాంతములోనూ గ్రామీణ, పేద, రైతాంగ యువకులకు పనులు దొరుకుతాయని అనుకున్నాం. బొగ్గు బావులు వచ్చాయిగాని ఇక్కడి వాళ్ళకు పనులివ్వకుండా కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలోని బావులలో పనిచేసే కార్మికులను తగ్గించి ఇక్కడికి పంపారు. అయినప్పటికీ తమకు మంచి రోజులు రాకపోతాయా అని ఇక్కడి ప్రజలు ఎదురుచూశారు. మంచి రోజులు రాకముందే బొగ్గు బావులు మూతపడి వాటి స్థానంలో స్థానిక ప్రజలకు విధ్వంసమే తప్ప ఏ ప్రయోజనాలు ఇవ్వని ఓపెన్‌కాస్ట్ గనులు వస్తున్నాయి. ఓపెన్‌కాస్ట్ వల్ల కంపెనీకి ఉత్పత్తి పెరుగుతుంది, లాభాలు పెరుగుతాయి. ఖరీదైన పరికరాలు కొనుగోలులో అధికారులకు కమీషన్‌లు ముడుతాయి. ప్రజలకు పనులేమీ దొరకకపోగా ఉన్న భూములు పోతాయి. ధూళి కాలుష్యం పెరుగుతుంది. బావులు, బోర్లు ఇంకిపోతాయి. పోనీ ఓపెన్‌కాస్ట్ పద్ధతిలో శరవేగంగా తవ్వి తీసిన బొగ్గును ఇంధనంగా వాడే పరిశ్రమలు ఇక్కడేమైనా పెడుతున్నారా అంటే అదీ లేదు. అదంతా బయటికి పోతుంది. వేరే ఎవరికో అభివృద్ధినిస్తుంది. ఇక్కడ ప్రజలకు మిగిలేది బొందలు, మట్టిగుట్టలు మాత్రమే.

కనీసం తీసేసుకున్న భూములకు నష్టపరిహారం, చట్టప్రకారం పునరావాసమైనా ఇస్తున్నారా అంటే అదీ లేదు. జంగేడు, గడ్డిగానిపల్లి గ్రామస్తులకు చెందిన 528 ఎకరాల పట్టా భూమిని, 300 ఎకరాల సీలింగ్ భూమిని తీసుకుంటున్నారు. పట్టా భూమికి ఇప్పటివరకు నష్టపరిహారం ఇవ్వలేదు. పట్టాభూమికి రిజిస్ట్రేషన్ ధర చెల్లించి కోర్టుల చుట్టూ తిప్పే బదులు రైతుల సమ్మతితో మంచి ధర నిర్ణయించి

చెల్లిస్తామని అధికారులు అన్నారు కాని రైతులతో మాట్లాడకుండా దళారులతో మాట్లాడుతున్నారు. దళారులు బహిరంగంగానే 12 శాతం కమిషన్ తమకు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. జంగేడు సర్పంచ్ 6 శాతం కమిషన్ మాత్రమే తీసుకొనే వేరొక దళారిని రంగంలోకి తెచ్చారు. ఆ మేరకైనా తన గ్రామ ప్రజలకు తాను న్యాయం చేస్తున్నానని ఆయన అనుకుంటుండవచ్చును. కాని రైతుల సమ్మతికి దళారులతో ఏం పని, అధికారులు దళారులను ఎందుకు ప్రోత్సహిస్తున్నారు? జిల్లా కలెక్టర్ గాని ఆయన అనుమతితో వేరొక అధికారిగాని గ్రామసభ నిర్వహించి రైతులతో నేరుగా మాట్లాడాలి. ఇచ్చే ప్రతిపైసా రైతుకే ముట్టాలి.

సీలింగ్ భూమి చేసుకొంటున్న వారిది మరీ అన్యాయమైన పరిస్థితి. వారంతా దళితులు. వేరే ఏ ఆధారం లేనివారు. 15-20 సంవత్సరాలుగా ఈ భూమిని సాగు చేసుకుంటున్నవారు. సీలింగ్ చట్టం కింద మిగులు భూమిని గుర్తించి స్వాధీనం చేసుకున్న తర్వాత అర్హులైన పేదలకు దాన్ని పంచవలసిన బాధ్యత ప్రభుత్వానిదే. కాని ప్రభుత్వం ఆ పని చేయలేదు. భూమిలేని పేద, దళితులే ఆ భూమిలోకి దిగి సాగు చేసుకోసాగారు. అపుడైనా ప్రభుత్వం మేల్కొని వారికి పట్టాలు ఇచ్చి ఉండవచ్చునుగాని అదీ జరగలేదు. ప్రజలే ఆ భూములను బాగు చేసుకొని, సాగు చేసుకొని జీవనం పొందుతున్నారు. వారికి పట్టాలిచ్చి ఉంటే ఇప్పుడు నష్టపరిహారమైనా దక్కి ఉండేది. మన రాష్ట్ర హైకోర్టు 2004లో మేకల పాండు కేసులో ఇచ్చిన తీర్పును అనుసరించి స్వంత భూములున్న రైతులకు ఎంత వస్తుందో అంత మొత్తమూ వచ్చేది. ఇప్పుడు పట్టా ఇవ్వలేదు కాబట్టి మీకు నష్టపరిహారం అసలే రాదని దబాయిస్తున్నారు. వారందరికీ పట్టాలిచ్చి పూర్తిస్థాయి నష్టపరిహారం ఇవ్వాలని మేము డిమాండ్ చేస్తున్నాము.

అయితే ప్రజలకు కలిగే నష్టం భూసేకరణకే పరిమితం కాదు. ఇంకా మిగిలి ఉన్న భూములలో వ్యవసాయం సాధ్యం కాదు. భూగర్భ జలాలు వేగంగా ఇంకిపోతాయి. ధూళి, కాలుష్యం పొలాలను, ఆవాసాలను తీవ్రంగా కలుషితం చేస్తాయి. ఇప్పటికే 1, 1ఎ ఇంక్లైన్‌ల పుణ్యాన నాలుగేళ్ళుగా తమ బావులు, బోర్లు ఇంకిపోతున్నట్టు గడ్డిగానిపల్లె ప్రజలు అంటున్నారు. ఓపెన్ కాస్ట్ గనులు ఇంకా లోతుగా తవ్వుతారు కాబట్టి భూగర్భ జలాల వినాశనం ఇంకా ఎక్కువగా ఉండబోతుంది. అంతేకాక ఓపెన్‌కాస్ట్ తవ్వకం కోసం పై మట్టిని తీసి గుట్టలు పోస్తారు. బొగ్గు వెలికితీత సాగే కొద్దీ మట్టి గుట్టలు పెరుగుతాయి. వీటి మీద ఎప్పటికప్పుడు నీళ్ళు చల్లుతామని, మొక్కలు పెంచుతామని అంటారు కాని అవన్నీ అప్పుడప్పుడు, అక్కడికక్కడ కంటితుడుపుగా జరిగేవి తప్ప ఒక పద్ధతి ప్రకారం జరగవని కరీంనగర్ జిల్లా రామగుండం ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు అనుభవం మనకు తెలియజేస్తుంది. కాబట్టి ఊర్లమీద, పొలాలమీద దుమ్ము పుష్కలంగా పడుతుంది. పంట దిగుబడి, ప్రజారోగ్యం దెబ్బతింటాయి. భూమి కోల్పోయే రైతులేగాక ఉపాధి కోల్పోయే గీత కార్మికులు చాలామంది ఉన్నారు. వ్యవసాయ కూలీ కుటుంబాలు 1000, గీత కార్మికుల కుటుంబాలు 300 ఈ భూసేకరణ వల్ల తమ జీవనాన్ని పూర్తిగా కోల్పోతారని అంచనా. భూసేకరణ వల్ల ఉపాధి కోల్పోయే వ్యవసాయ కూలీలకు 650 రోజుల దినవేతనం నష్టపరిహారంగా కట్టి ఇవ్వాలని 2005లో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 68 అంటుంది. గీత కార్మికులకు కూడా అది

వర్తిస్తుంది. కాని అటువంటి జీవో ఒకటి ఉందనిగాని, దానికింద ప్రజలకు హక్కులు ఉన్నాయనిగాని ఎరగనట్టే అధికారులు నడుచుకుంటున్నారు.

**మా డిమాండ్లు:**

1. వ్యవసాయ భూములకిచ్చే నష్టపరిహార విషయంలో ప్రభుత్వం ఏ దళారుల ప్రమేయం లేకుండా గ్రామసభలు పెట్టి నేరుగా రైతులతో మాట్లాడాలి.
2. సీలింగ్ భూములు సాగు చేస్తున్న భూమిలేని పేదలందరికీ వెంటనే పట్టాలివ్వాలి. మన రాష్ట్ర హైకోర్టు మేకల పాండు కేసులో ఇచ్చిన తీర్పును అనుసరించి వారికి కూడా పూర్తిస్థాయి నష్టపరిహారం ఇవ్వాలి.
3. జీవో నెం. 68 ప్రకారం వ్యవసాయ కూలీలకు, గీత కార్మికులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలి.
4. ఓపెన్‌కాస్ట్ గనుల సమీపంలో భూగర్భ జలాల క్షీణతవల్ల, దుమ్ము, కాలుష్యాలవల్ల నివాసం, సేద్యం సాధ్యం కావు కాబట్టి ఆ భూములకు కూడా పూర్తిస్థాయి నష్టపరిహారం ఇచ్చి గ్రామానికి గ్రామంగా ప్రజలు ఎంచుకున్న చోట పునరావాసం కల్పించాలి.
5. ఉత్తర తెలంగాణ జిల్లాల్లోని బొగ్గు, ఖనిజాన్నంతా ఓపెన్‌కాస్ట్ తవ్వకాల ద్వారా 20 లేక 30 ఏళ్ళలో తవ్వితీసి ఇతర ప్రాంతాలకు తరలించి ఇక్కడ బీడు భూములు, మట్టి గుట్టలు, బొందలు మిగిలించే విధ్వంసకర విధానాన్ని సింగరేణి యాజమాన్యం వదులుకోవాలి.

వరంగల్ జిల్లాశాఖ, 21-5-2008